విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం 11 ఏప్రిల్, 2025 | 8 పేజీలు

నేడు ఒంటిమిట్ట కోదండ రామయ్య కల్యాణం

- సీఎం చంద్రబాబు రాకకు ముస్తాబైన ఏకశిలా నగరం
- లక్షలాది భక్తుల రాక
- భద్రతా ఏర్పాట్లకు 3000 మంది పోలీసులు
- కళ్యాణ వేదిక వద్ద 147గ్యాలరీలు, 23ఎల్ఈడీ స్క్రీన్‌లు
- వాహనాల రాకపోకల కోసం మార్గమార్పులు
- 20 ఉచిత బస్సులు అందుబాటులోకి
- అన్నదానంతో పాటు లడ్డూ ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు
- ముత్యాల తలంబ్రాలకు 23 కౌంటర్ల ఏర్పాటు
- ఆలయం విద్యుత్ దీపాలతో కాంతుల హరివిల్లు

8 లో

ఎండలు బాబోయ్..

ఎండలు



విశాలాంధ్ర–పులివెందుల: అదిగో ఇదిగో అంటూ కాస్త కాలం పూర్తవగానే వేసవి రానే వచ్చింది.. నిమిషాలు గంటలై.. గంటలు వారాలై.. వారాలు నెలలై ఇలా ఏడాది కాలం ముగియడంతో వేసవి కూడా ప్రారంభమైంది. ఈ వేసవి ఇప్పుడిప్పుడే మొదలైంది. శివరాత్రి పండుగ ముగిసిందో లేదో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటలు నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. తీవ్రమైన ఎండలకు అటు రైతులు ఇటు వ్యవసాయ కూలీలు మరోవైపు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పుడే ఎండ తీవ్రత ఇలా ఉంటే మున్ముందు ఎలా ఉంటుందోనన్న ఆందోళన కనిపిస్తోంది. విపరీతమైన

2 లో

నడిఊరు రహస్యం!

- ప్రవేశించేందుకు జంకుతున్న యంత్రాంగం
- పన్నుల ఎగవేతలో ధనవంతులు
- ప్రభుత్వం ఏదైనా చలామణి
- పెద్ద మనుషుల ముసుగులో సంచారం

విశాలాంధ్ర–యర్రగుంట్ల: స్థానిక పురపాలిక పరిధిలోని నడిఊరుగా ప్రసిద్ధిగాంచిన ప్రాంతంలోకి వెళ్లి నియమ నిబంధనల మేరకు పన్నులు వసూలు చేయాలంటే ఇక్కడి యంత్రాంగం జంకుతున్న పరిస్థితి ఉంది. ఇక్కడ రాజకోట రహస్యం తరహాలో నడిఊరి రహస్యం దాగి ఉన్న వైనం స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఇంటి, ఆస్తి పన్నుల విషయంలోని రహస్యం అంతర్గత రహస్యంగా ఉంది. ఓసారి లోనికి వెళ్లి పరిశీలిస్తే..గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నిర్మితమైన గృహాలకు పన్నులు నిబంధనల మేరకు ఉంటాయి. అయితే 2012 నుండి నూతనంగా నిర్మించిన, పునఃనిర్మించిన వాటికి పురపాలిక నుండి అన్ని రకాల అనుమతులు పొందాల్సి ఉంది. అయితే అలా అనుమతులు పొందని వాటిని అక్రమ కట్టడాలుగా నిర్ణయించి జరిమానా కింద (ఉదాహరణకు ఓ భవనానికి రూ.10వేలు పన్ను ఉంటే అదనంగా మరో రూ.10వేలు జత చేసి వసూలు చేయాలని నిబంధనలు ఉన్నాయి) అదనపు మొత్తాన్ని వసూలు చేయాల్సి ఉంది. ఇక్కడే మతలబుదాగి ఉంది. నడిఊరులో అధికశాతం తమ పాత నివాస గృహాలను పూర్తిగా తొలగించి నూతనంగా ఆధునిక భవనాలు నిర్మితమయ్యాయి. అయితే చాలా మంది పురపాలిక అనుమతులు తీసుకోకుండానే అలాంటి భవంతులు నిర్మించి ఉన్నారు. చాలా మటుకు ఈ భవనాలు రికార్డులలో నగర పంచాయతీగా ఏర్పడకముందు నిర్మితమై ఉన్నట్లు నమోదై ఉండడం గమనార్హం. పునః నిర్మితమైన ఓ వ్యక్తి భవనం 1955-60 మధ్యలో మరో వ్యక్తి పునః నిర్మించిన భవనం 2005-2011 మధ్యలో నిర్మితమై ఉన్నట్లు పురపాలిక రికార్డుల్లో నమోదై ఉండడాన్ని మనం గమనించవచ్చు. ఇక్కడ మరో ట్విస్టు ఏమిటంటే విలాసవంతంగా నిర్మించుకున్న ఇళ్లు బిఎల్‌సి (బెన్ఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్)గా నమోదై ఉంది. ఈ ఖరీదైన భవనం కూడా ప్రభుత్వ పక్కా గృహం కిందకు వస్తుంది. నిబంధనల మేరకు బీఎల్‌సి గృహాలకు పురపాలిక పన్నులు ఉండవు. ఇదే తరహాలో నడిఊరులో బిఎల్‌సి ఇళ్లు చాలానే ఉన్నాయి. నిబంధనల మేరకు ఈ ఇళ్లు ప్రభుత్వ పక్కా గృహంలా కాకుండా విలాసవంతమైన భవనాలే. ఇలా వీరు పురపాలిక ఆదాయానికి గండి కొడుతూ పట్టణంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతుండడం చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నడిఊరు కేంద్ర పాలిత ప్రాంతం తరహాలో ప్రత్యేక హక్కులు ఉన్నట్లుగా కనిపిస్తుండడం పట్టణ ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఓ సామాన్యుడు చిన్నపాటి గృహం నిర్మించుకుంటే సవాలక్ష నిబంధనలు వర్తిస్తాయి. కానీ నడి ఊరులో అవి వర్తించకపోవడానికి కారణం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇక్కడి చాలా మంది తమ వ్యవహారాలను చక్కబెట్టుకుం టుండడం కొసమెరుపు. ఇప్పటికైనా పురపాలిక యంత్రాంగం నడిఊరులోకి తొంగిచూసి రాబడికి ప్రయత్నిస్తే పట్టణ ప్రజలు హర్షిస్తారు. లేనిపక్షంలో పలువురు అభివృద్ధివాదులు ఈ అంశాలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోవాలని భావిస్తున్నారు.

ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణ వేదిక సిద్ధం

- టీటీడీ, జిల్లా అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు
- భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ
- భక్తులకు తలంబ్రాల ప్యాకెట్లు సిద్ధం
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

విశాలాంధ్ర–ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శుక్రవారం సాయంత్రం 6:30 నుండి రాత్రి 8:30 గంటల మధ్య శ్రీ సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. ఒంటిమిట్ట ఆలయ ప్రాంగణంలోని పరిపాన భవనం మీటింగ్ హాల్‌లో ఛైర్మన్, ఈవో జె.శ్యామలరావు, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈవో వీరబ్రహ్మం, జెసి అదితి సింగ్, ఎస్పీ ఈజీ. అశోక్ కుమార్, సివిఎస్వో హర్షవర్ధన్ రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

2 లో

వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముని గరుడసేవ

విశాలాంధ్ర–ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం రాత్రి 7 గంటలకు గరుడ వాహనంపై శ్రీ సీతారామ లక్ష్మణులు భక్తులకు అభయ మిచ్చారు. భక్తజన బృందా లు చెక్కభజనలు, కోలాటా లతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నా రు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు నిత్య వాహనం. దాసుడుగా, సఖుడుగా, విసన కర్రగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామ స్వామిని వహించి కదిలేతీరు సందర్శనీయమైనది. 108దివ్య దేశాలలోనూ గరుడ సేవ విశిష్టమైనది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీస్ ట్రైల్ రన్

విశాలాంధ్ర–సిద్దవటం: ఒంటిమిట్ట కోదండరామ స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు సీఎం చంద్రబాబు రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం పోలీస్ ట్రైల్ రన్ నిర్వహించారు. కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కడప ఎయిర్ పోర్టు నుంచి కడప - చెన్నై హైవేలో పోలీస్ ట్రైల్ రన్ నిర్వహించారు. పోలీస్ ట్రైల్ రన్ నేపథ్యంలో బద్వేలు, రాజంపేటకు వెళ్లే వాహనాలు భాకరాపేట వద్ద ఇరువైపులా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణ వేదిక సిద్ధం

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏకశిలానగరంలో ఏప్రిల్ 11న జరుగనున్న శ్రీ సీతారాముల కళ్యాణాన్ని టిటిడి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తాం.ముఖ్యమంత్రివర్యులు పట్టువస్త్రాలు సమర్పణ, శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా ఏప్రిల్ 11న సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రివర్యులు గౌ. శ్రీ నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 147 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటు చేశాం. ప్రతి గ్యాలరీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారామెడికల్, టిటిడి ఉద్యోగులు, పోలీసు, శ్రీవారి సేవకులు ఉండేలా చర్యలు చేపట్టాం. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశాం. కళ్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాం. నడిచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 11 ప్రాంతాలలో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేశాం. ఇందులో పానకం, మజ్జిగ, చలివేంద్రం, వాటర్ కూలర్లు, పోలీస్, మెడికల్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఆలయ సమీపంలో 3 వేల మంది భక్తులు వేచి ఉండేందుకు, క్యూ లైన్లలో వెళ్ళేందుకు జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశాం. శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఉండే భక్తులతో పాటు, కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా 23 ఎల్ ఈడీ స్క్రీన్ లు ఏర్పాటు చేశాం.

18 నుంచి శ్రీ గంగాభవాని అమ్మవారి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ శివారులోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి జరుగునని ఆలయ ప్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ 18 వతేదీన శుక్రవారం అమ్మవారి గణపతి పూజ, స్వస్తి వాచనము, మాతృకపూజ, ఋతిక్ వరణము, రక్షాబంధ నము, అష్టోత్తర కలశాభిషేకం అర్చనలు, మంగళ హారతి వంటి పూజా కార్య క్రమాలు జరుగునన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ గంగాభవాని అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన లక్ష కుంకుమార్చన పూజలు, పూజలో పాల్గొన్న పుణ్య స్త్రీలందరికి అమ్మవారి ప్రసాదాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మంగళ ప్రధమైన గాజులు, పసుపు, కుంకుమలు అందజేస్తారన్నారు. 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి గంటల నుంచి 9 గంటల లోపు చండీ హెూమం, మహా పూర్ణాహుతి, మంత్రపుష్పం, మహదాశీర్వచనం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 20వ తేదీ ఆదివారం అమ్మవారికి బోణాలు, అమ్మవారికి మొక్కుబడులు చెల్లింపు కార్యక్రమాలు జరుగునన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని వారు కోరారు.

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు

- అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

విశాలాంధ్ర-రామసముద్రం: అన్నమయ్య జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు గురువారం ఆయన రామసముద్రం మండలంలోని కమ్మవారి పల్లి పంచాయతీ ఎర్రబోయినపల్లి వద్దవివాదాస్పదంగా ఉన్న భూమిని పరిశీలించారు మదనపల్లికి చెందిన పోత్తూరు శోభకు 48 .49.63. సర్వే నెంబర్లలో 35 ఎకరాలు సెటిల్మెంట్ భూమి తో పాటు కృష్ణమూర్తి వెంకట్రామయ్య లు ఎర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన రైతులు మధ్య వివాదము ఉన్నట్లు వారు తెలిపారు దీంతో జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు పేర్కొన్నారు 2011 నుండి భూ సమస్య ఉన్నట్లు తెలిపారు రికార్డులు చిత్తూరు నుండి తెప్పించుకుని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తా నని తెలిపారు ఆర్ నడుంపల్లికి చెందిన చలపతి వడ్డివాని చెరువు పూర్తిగా దురాక్రమనైందని జెసికి ఫిర్యాదు చేశాడు వెంటనే చెరువు దురాక్రమంపై తహసిల్దార్ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు అనంతరం స్థానిక తహసిల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి భూ సమస్యలపై పలు సూచనలు ఇచ్చారు కమ్మవారిపల్లె సర్పంచ్ ఇంజము వెంకటరమణ మాజీ సర్పంచ్ చలపతి నాయుడులు తహసిల్దార్ రైతులకు సహకరించలేదని జెసి దృష్టికి తీసుకెళ్లారు జేసి మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్య ఉన్న రికార్డులు సక్రమంగా ఉంటే తప్పనిసరిగా సమస్య పరిష్కరిస్తారని తెలిపారు కిందిస్థాయిలో రెవెన్యూ అధికారులు సహకరించకపోతే మదనపల్లె సబ్ కలెక్టర్ ఆ తర్వాత జెసిగా తాను సమస్త పరిష్కరించేందుకు సత్వరం చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలాదేవి మండల సర్వేయర్ నాగరాజ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవం మే డే విజయవంతం చేద్దాం

- కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం
- మే 20న సార్వత్రిక సమ్మె విజయవంతం చేద్దాం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

విశాలాంధ్ర-మదనపల్లె: మే 1వ తేదీన ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే విజయవంతం చేద్దామని, మేడే పోరాట స్ఫూర్తితో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక -కార్పొరేట్ అనుకూల విధానాలపై ఉద్యమిద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఆనాడు ఎనిమిది గంటల పని దినాలు కోసం పెద్ద ఎత్తున కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలను నేడు కార్మిక ఓట్లతో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎని గంటలు పెంచి కార్మిక శ్రమను దోచుకోవడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తోందన్నారు.మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారా ఎండకడతామని తెలిపారు. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ వ్యవసాయ, సహకార రంగాలను కూడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి పెద్ద కుట్రలు చేస్తుందని విమర్శించారు. కేంద్ర రంగాలైన రైల్వే, రక్షణ, విద్యుత్తు, పబ్లిక్ సర్వీస్ లను ప్రైవేటు పరం చేయాలని ఆలోచనలను రోజురోజుకు తీవ్రతం చేస్తుందన్నారు .వాటిలో అధిక పెట్టుబడులను ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు ఇస్తుందని దీనికి వ్యతిరేకంగా, కార్మి కులు, ప్రజలు తిరుగుబాటు చేయాలని కోరారు. మరోవైపు రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఇప్పటికైనా నిత్యవసర వస్తువుల పైన విధించిన జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంట గ్యాస్ లపై ఎక్సైజ్ సుంకం కూడా తగ్గించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను అన్నమయ్య జిల్లాలో విజయవంతం చేద్దామన్నారు .ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల,సాబ్ జాన్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-సుండుపల్లె: జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను విడుదల చేసిన జాయింట్ కలెక్టర్, చేతుల మీదుగా గురువారం జిల్లా సర్వే అధికారి విలేజ్ సర్వేర్లు క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు టి.జగదీశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఇస్మాయిల్ వైస్ ప్రెసిడెంట్ యోగనంద, కోశాధికారి సలీంబాష ఈ సందర్భంగా గా రెవెన్యూ శాఖలో సర్వేయర్స్ పాత్ర చాలా ప్రముఖమని అందరూ చిత్తశుద్ధితో పనిచేసి డిపార్ట్మెంట్ కి మంచి పేరు తీసుకురావాలి అని సూచించారు. అలాగే అసోసియేషన్ ఏర్పాటు కూడా చాలా మంచి పరిణామంగా అభివర్ణించారు.

ఎండలు బాబోయ్ ఎండలు

ఎండలకు తిరిగితే డయేరియా వ్యాధి (వీరేచనాలు) ప్రబలే అవకాశం ఉన్నట్లు వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో కూడా దప్పిక కూడా ఎక్కువగా ఉంటుంది. సరిపడు నీరు తీసుకొనకపోతే వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నట్లు కూడా వైద్యులు వెల్లడించారు. వేసవికాలం అనేది నాలుగు సమశీతోష్ణ కాలాల్లో వెచ్చని కాలంగా చెప్పవచ్చు, ఇది వసంతఋతువు, ఆకురాలే కాలం మధ్య వస్తుంది. ఈ కాలంలో ఎక్కువ గంటలు వెలుతురు (పగళ్లు), తక్కువ గంటలు చీకటి (రాత్రిళ్లు) వుంటుంది . ఈ కాలాలు ఖగోళ శాస్త్రం, ప్రాంతీయ వాతావరణ శాస్త్రంపై ఆధారపడి వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు తేదీల్లో ప్రారంభమవుతాయి. అయితే, భూమి దక్షిణ అర్ధగోళం వేసవి కాలమైనప్పుడు, ఉత్తర అర్ధగోళంలో శీతాకాలం వస్తుంది, దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. ఉష్ణమండలీయ, ఉపఉష్ణమండలీయ ప్రాంతాల్లో, వేసవి కాలం సమయంలో ఆర్ద్ర కాలం సంభవిస్తుంది. వేసవికాలంలో ఉష్ణమండలీయ తుఫానులు పెరిగి, ఉష్ణమండలీయ, ఉప ఉష్ణమండలీయ సముద్రాల్లో తిరుగుతాయి. వేసవి కాలంలో వాతావరణం వేడిగా, తేమగా, పొడిగా ఉంటుంది. భూమి సూర్యుని వైపు వంగి ఉండటం వల్ల కొన్ని ప్రదేశాలలో ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా పెరుగుతాయి. వేసవిలో సూర్యుడు ప్రకాశవంతంగా ప్రకాశిస్తాడు. వేసవిలో మనకు అనేక కాలానుగుణ పండ్లు కూరగాయలు లభిస్తాయి. ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి. రోజుకు కనీసం 4 లేదా 5 లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలి. ఒంటికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. ఎండలో ప్రయాణించే వారు గొడుగు, హెల్మెట్, గౌజ్లు వాడాలి. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేవిధంగా చూసుకోవాలి. ఇలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటే వేసవి నుంచి ఉపశమనం పొందవచ్చు.

మిట్స్‌లో జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోసియం

విశాలాంధ్ర-మదనపల్లె: అంగళ్ళు సమీపం లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, సైన్స్, మదనపల్లె లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) విభాగం వారు జాతీయ స్థా యిలో టెక్నికల్ సింపోసియం ను ఏర్పాటు చేసినారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యన్ రాజ్‌పుత్, సి.ఈ.ఓ (%జజూ%) అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్, హైదరాబాద్ పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న కొద్దీ సైబర్ మోసాలూ అంతకంతకూ పెరుగుతున్నాయి అని అన్నారు. అమాయకుల్ని టార్గెట్ చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏమాత్రం అనుమానం రాకుండా ఖాతాల్లో డబ్బును ఊహకందని రీతిలో లూటీ చేసేస్తున్నారు అన్నారు. సైబర్ మాయాజాలంతో సామా న్యులనే కాదు ప్రముఖుల్ని సైతం బురిడీ కొట్టిస్తున్న అనేక ఘటనలు వెలుగుచూస్తున్నాయి అన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచి మోసాల బారిన పడకుండా, విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. జియో పొలిటి కల్ టెన్సన్స్ వళ్ళ సైబర్ వార్ఫేర్ కు దారి దీసిందని, డేటా సెక్యూరిటీ ఎంతో ముఖ్యమని, డేటా కు భద్రత ఎంతో ముఖ్యమని మనారు. ప్రస్తుతం వీటి పై పరిశోధనలు ఎక్కువగా జరుగుతున్నాయని, విద్యా ర్థులు, అధ్యాపకులు పరిశోధనలు చేయాలనీ ఆయన అన్నారు. వీటి పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వీటి పై ఉద్యోగ అవకా శాలు కూడా మెరుగుగా ఉన్నాయని ఆయన అన్నారు. కార్యకమం లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ గంగా దేవి, కో ఆర్డినేటర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శివరంజిని, స్టూడెంట్ కో ఆర్డినేటర్ రేవంత్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో మహిళలు నిరసన

విశాలాంధ్ర-సిద్దవటం: సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లి గ్రామ మహిళలు తాగునీటి కోసం గురువారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిద్దవటం మడలం ఉప్పరపల్లి గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మహిళలు తెలిపారు. తాగునీటి సమస్యం పరిష్కరించాలని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. సంబంధిత అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించక పోతే పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని మహిళలు హెచ్చరించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మనోహర్ ను వివరణ కోరగా ఉప్పరపల్లె గ్రామంలో నీటి సమస్య ఉన్నది వాస్తవమేనని పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన వివరించారు.

నిజమైన అర్హులకు న్యాయం చేస్తాం

ఆర్డీఓ శ్రీనివాసులు

విశాలాంధ్ర-గాలివీడు: సోలార్ పవర్ ప్లాం ట్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పో యిన నిజమైన అర్హులందరికీ న్యాయం చేస్తామని ఆర్డీఓ శ్రీనువాసులు తెలిపారు. గురువారం గాలివీడు మండలంలో పర్యటిం చిన ఆయన తూముకుంట సోలార్ నిర్వాసి తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ 100మెగావాట్ల సోలార్ అదనపు పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం 114యకరాల భూముని గుర్తించగా అం దులో 57ఎకరాలు ప్రభుత్వ స్థలం కాగా, 57ఎకరాలు డీకేటీ, అనుభవంలో వున్న ట్లుగా గుర్తించామన్నారు. ప్రభుత్వం నిర్ణ యించిన మేరకు బాధితులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ఇందులో నిజమైన అర్హు లు ఎవరైతే వుంటారో వారందరికీ నష్టప రిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డంపింగ్ యార్డ్‌లో మాత్రమే చెత్తాచెదారం వెయ్యాలి

కుశావతి నగర్‌కు చెందిన స్థానికులు ఆర్డీవోను కలసి కుశావతి నది (చిన్నేరు) లో చెత్తా చెదారం వెయ్యడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఆప్రాం తంలో చెత్తాచె దారం వెయ్యడం ద్వారా చుట్టు పక్కల నివా సం వుంటున్న తాము అనారో గ్యం పాలౌతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఆర్డీవో శ్రీనివాసులు చెత్తా చెదారం డంపింగ్ కోసం కేటాయించిన స్థలంలో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. అయితే గతంలోనే చెత్త డంప్ చెయ్యడం కోసం కుంచిబండ వద్ద స్థలం కేటాయించామని పంచాయతీ వారు మాత్రం వినియోగించుకోవడం లేదని ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో పంచాయతీ సిబ్బంది చెత్తను కేటాయించిన డంపింగ్ యార్డ్‌లో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని డీపీఓకు చారవాణి ద్వారా సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ రవికుమార్‌కు జాతీయ ప్రతిభా అవార్డు

విశాలాంధ్ర-జమ్మలమడుగు: జమ్మలమడుగు పట్టణానికి చెందిన ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్ కు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సౌత్ రన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. గత 12 సంవత్సరాల నుండి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అంకితభావంతో క్రియాశీలకంగా పనిచేస్తూ ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి పాటుపడుతూ, అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన జపాన్ లోని ఏఐజెడ్ యు యూనివర్సిటీలో పరిశోధనలు చేసి, సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగంలో విశేషమైన కృషి చేసినందుకు గాను ఆయన విలువైన సేవలను గౌరవిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డుకు డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారం ను ప్రధానం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్ర, వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

కూటమి ప్రభుత్వం పది నెలల్లో ఏ హామీ నెరవేర్చలేదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం. అధికారంలోకి వచ్చి పది నెలలు అయినప్పటికీ ప్రజల కు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని వైయస్సార్‌సీపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా చేతులెత్తేశారన్నారు ఇచ్చిన ఒక హామీ ఇవ్వకుండానే లక్షా 60వేల కోట్లు అప్పు చేశారన్నారు. అంతేకాకుండా పెట్రోలు డీజిల్ రేట్లు రేపు మంగళవారం నుంచి ప్రతి లీటర్ పై 2రూపాయలు పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లపై 50రూపాయలు పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై పెనుఫారం లోపం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పెంచిన భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం జరిగిందన్నారు. సంపద సృష్టి అంటే బ్యాంకులలో అప్పు తేవడం. కాదన్నారు. రాష్ట్రంలో 6కోట్ల మంది జనాభా ఉంటే ఈ సంవత్సరంలో కేవలం 5 లక్షల మందికి మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, ఎన్నారై నాయకులు. బిహెచ్ ఇలియాస్, శ్రీనివాసులు రెడ్డి, త్యాగరాజు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పని చేయని కెనరా బ్యాంకు ఏటిఎం

విశాలాంధ్ర -ముద్దనూరు: స్థానిక కెనరా బ్యాంకు ఎటిఎం గత కొంత కాలంగా పని చేయ లేదని ప్రజలు వాపోతున్నారు. ఎటిఎం పని చేయక తెరవక పోవడంతో బ్యాంకుల వద్ద నగదు తీసుకోవడానికి జనాలు ఉండంతో చాల సమయం పడుతుందంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు, ఎటిఎం తెరిస్తే నగదు కోసం బ్యాంకులోకి వెళాల్సిన అవసరం లేదని కావున బ్యాంకు అధికారులు ఎటిఎం మరమత్తులు చేసి ఎటిఎం సేవలు ప్రజలకు అందేలా చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఆశాల వేతనాలు ఇవ్వండి

విశాలాంధ్ర-కడప రూరల్: ప్రభుత్వం తమకు మార్చి నెల వేతనాలు తక్షణం ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ శాంతమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదో తారీకు వచ్చినప్పటికీ ఇంతవరకు ఆశాల వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆశాలకు ఇచ్చే అరకొర వేతనం ఆశాలకు రాక నెలవారీ ఖర్చులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణం వేతనాలు ఇచ్చి ఆశాలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి అమ్ములు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు సమర్పణ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శుక్రవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు శ్రీ కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను గురువారం సమర్పించారు. మొత్తం 120 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, అర్చకులు శ్రీ శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ తలంబ్రాల కోసం మూడు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిభావంతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, మూడు ఏళ్లుగా అయోధ్యకి, 8ఏళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని శ్రీ కళ్యాణ అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇతర అధికారులు, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ పరిశీలన

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె మండల పరిధిలోని ముచ్చుకోన వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌ను టిడిపి నాయకుడు ఎస్‌పి జయచంద్రారెడ్డి గురువారం పరిశీలించారు. ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు ఈ పంప్‌హౌన్ నుంచి పాపాఘ్ని నదిలో కలుస్తాయి. ఏటికి నీరు వెళ్లడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. అటు గొట్టపు బోర్లు, ఇటు మంచినీటి బోర్లలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇటీవల వేంపల్లె పంచాయతీ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం స్పందించిందన్నారు. వేసవి కావడంతో మంచినీటి సమస్య రావడం సహజమే అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి దాహార్తిని తీర్చడంలో సఫలీకృతమైందన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తాను స్పందిస్తానని, మంచినీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు.

ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: దండకారణ్యంలో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలుపుదల చేయాలని, ప్రజాసంఘాల ఐక్య వేదిక సభ్యులు పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ గోపాల్, ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, ఏపీ సి ఎల్ పి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ అలీ ఖాన్, డాక్టర్ రాజా వెంగల్ రెడ్డి, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు ద్రాక్ష శ్రీనివాసులు, ముస్లిం మైనారిటీ ఎన్ ఆర్ సి, సిఎఎ కన్వీనర్ బాబు బాయ్, డిమాండ్ చేశారు. గురువారం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆదివాసీలను సొంత గడ్డ నుండి నిర్వాసితులను చేస్తూ జీవించే హక్కును కాలరాస్తున్న 'ఆపరేషన్ కగార్' బహుళ జాతి సంస్థల ప్రయోజనాలను కాపాడడానికి తప్ప మరి ఏ ఇతర ఫలితాన్ని సాధించదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ పరిధిని అతిక్రమించి ఆదివాసీల విషయంలో హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని, అన్ని ప్రజాస్వామ్య సాంప్రదాయాలను కాలరాస్తూ, గిరిజనులను జీవనోపాధులకు దూరం చేస్తూ, నరమేధానికి పాల్పడుతున్న ఫాసిస్ట్ బిజెపి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలుపుదల చేస్తూ, శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలని వారు కోరారు.బిజెపి మత రాకాసి కులాల, మతాల మధ్య చిచ్చు పెడుతూ అమాయకులను బలి తీసుకుంటుందని, దుష్ట పన్నాగాల నుంచి సమాజాన్ని రక్షించుకోవాలని వారు అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రమాదంలో ఉన్నారని, అణిచివేత రూపాలను మార్చుకుంటూ ఆదివాసీల హత్యాకాండను కొనసాగిస్తూ ఉందని, ఇది నేడో రేపో పట్టణాలలోకి చొరబడి అర్బన్ నక్సల్స్ పేరుతో తన వ్యతిరేకులను అంతమందించటానికి ఈ ఆపరేషన్ నిర్వహించిన ఆశ్చర్యకునవసరం లేదని దీనిని అందరూ వ్యతిరేకించాలని వారు సూచించారు. ఏప్రిల్ 20న కడప ఇంజనీర్స్ బిల్డింగ్ నందు ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తూ ఓ సదస్సు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయులు ఉద్యోగులు కార్మికులు మహిళలు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో. రాము, సిద్ధిరామయ్య, మడగలం ప్రసాద్, నాజర్, సంపత్ కుమార్, ఫణి రాజు తదితరులు హాజరయ్యారు.

గండికోటకు యునెస్కోలో చోటు కోసం కృషి: ఎమ్మెల్యే ఆది

విశాలాంధ్ర-జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట ను యునెస్కోలో చోటు కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డిలు పేర్కొన్నారు. గురువారం కేంద్ర పురావస్తు శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ జాన్విజ్ శర్మ, కేంద్ర గనుల శాఖ కార్యదర్శి కాంతారావు, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ అదితి శర్మ... తదితరులు కోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ గండికోటకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నామన్నారు. గండికోటలోని జుమ్మా మసీదు, ధాన్య గారం, పెన్నాలోయ తదితర ప్రాంతాలను పరిశీలించారు.గండికోట వంటి ప్రదేశం ప్రపంచ వారసత్వ కట్టడం గా యునెస్కోవారు గుర్తించాలంటే ఏమేమి ఉండాలో అధికారులు చర్చించారు. జియాలజీ, కేంద్ర పురావస్తు శాఖ, కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖ అధికారులు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. యునెస్కోలో గండికోట ను కలపాలని ఆలోచన ఉన్నా... ఏమేమి అవసరమనే చర్చ జరిగిందని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. గండికోట లోపల 160ఇళ్ళు ఉన్నాయని వారందరిని గౌరవంగా ఖాళీ చేపించాల్సి ఉందన్నారు. గండికోట ను యునెస్కో వాళ్ళు గుర్తిస్తే అద్భుతమని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో యునెస్కో గండికోటను గుర్తిస్తుందని, వరల్డ్ టూరిజం గా మారుతుందని మనందరం ఆశాజనకంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపురం మండలం ఇంచార్జ్ శివ నారాయణరెడ్డి, కూటమి నాయకులు యూత్ నాగేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, చెక్క డిపో సునీల్, అధికారులు పాల్గొన్నారు.

విమర్శలు సిగ్గుచేటు

- టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: రాష్ట్రంలోని పోలీసులను బట్టలుఊడదీసి నిలబెడతాను అని వైసిపి అధ్యక్షుడు జగన్ చేసిన కామెంట్లను ఒక భారత పౌరుడిగా, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా నేను ఖండించిన మాట వాస్తవమని తిరుమలేష్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు నా మీద ఇష్టానుసారంగా చేసిన వ్యక్తిగత వాక్యాలను ఖండిస్తూ ఆధారాలు లేని వ్యాఖ్యలు చేసినందున పరువు నష్టం దావా కేసు వేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి పాలన వలన ప్రజలు విసుగు చెంది ఓడించారని, కడపలో మొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్ పెట్టుకుని నీళ్లు అమ్ముకుని, అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చేది ఎవరో కడప ప్రజానీకానికి తెలుసన్నారు.కడపలో ఓ కుటుంబం వద్ద డబ్బులు అప్పు తీసుకుని ఎగ్గొట్టిన మియాకు ఆదిత్య మద్దతుగా నిలబడటం సిగ్గు చేటన్నారు. విద్యార్థి సంఘ ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు చేయడం మానుకుని, నిరూపణ చేయాలన్నారు. బహిరంగ చర్చకు సిద్ధమైతే మీడియా సాక్షిగా చర్చకు రావాలన్నారు. దమ్ముంటే అవినీతి అక్రమాలు బయట పెట్టాలన్నారు. ఆదిత్య వల్ల అధిక వడ్డీలకు తీసుకున్న బాధితులు త్వరలో స్టేషన్ లకు క్యూ కడతారన్నారు. వ్యక్తిగత విమర్శలు చేసే ముందు మీ వ్యక్తిగతం గురించి కూడా ఆలోచించాలన్నారు.ఎవరు చట్ట విరుద్ధమైన పనులు చేస్తున్నారో, అక్రమ దందాలు, వడ్డీ వసూళ్లు చేస్తున్నారో నిదానంగా బయటకు వస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్ సింహా, ఫరీద్, అరవింద్ పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలు, మూల్యాంకనం చక్కగా నిర్వహించారు..

- డీఈఓ కార్యాలయ సిబ్బందికి ఎస్టీయు అభినందన

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: పదవ తరగతి పరీక్షలను ఎన్నో ఒడిదుడుకులు మరియు ఇబ్బందులు మధ్య చాలా చక్కగా నిర్వహించారని అలాగే మూల్యాంకన ప్రక్రియ నిర్వహణలో కూడా డీఈఓ కార్యాలయ సిబ్బంది చక్కగా సమన్వయంతో కృషి చేశారని ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ భాషా,సంగమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ 2025 మార్చి నెలలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో కడప జిల్లా వల్లూరు మండలంలోని పరీక్షా కేంద్రంలో గణిత ప్రశ్నా పత్రం లీకేజ్ విషయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించారని సస్పెన్షన్కు గురైన చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్విజిలేటర్ వెంకటరమణలపై మానవత దృక్పథంతో సస్పెన్షన్ ఎత్తివేసి విచారణ కమిటీ నియమించాలని వారు ముగ్గురికి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. అలాగే జిల్లాలోని ఉపాధ్యాయుల టిఐఎస్ డేటాలోని తప్పుల సవరణకు సంబంధించిన గ్రీవెన్స్‌ను నేరుగా ఉపాధ్యాయుడే జిల్లా కార్యాలయానికి రానవసరం లేకుండా సంబంధిత మండల విద్యాశాఖ అధికారుల ద్వారా గ్రీవెన్స్‌ను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పదవ తరగతి పరీక్షలను మరియు స్పాట్ మూల్యాంకన ప్రక్రియను సజావుగా పూర్తి చేసినందుకు మిమ్ములను మీ సిబ్బందిని జిల్లా శాఖ పక్షాన అభినందిస్తూ! సత్వరమే మూల్యాంకన విధులకు సంబంధించిన గౌరవ భృతిని విడుదల చేయవలసిందిగా ఎస్టీయు జిల్లా శాఖ పక్షాన విజ్ఞప్తి చేయడం జరిగింది.

శరవేగంగా బస్టాండ్ నిర్మాణ పనులు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: స్థానిక ఏపిఎస్ ఆర్టీసి బస్టాండ్ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రయాణీకుల సౌకర్యార్థం నూతన హంగులతో బస్టాండ్ ను తీర్చి దిద్దుతున్నారు. స్థానిక కంట్రోలర్ జమాల్ దగ్గరుండి పనులను పర్య వేక్షిస్తున్నారు. నాలుగు, ఐదు రోజుల్లో మొత్తం పనులు పూర్తవుతాయని సమాచారం. బద్వేల్ డిఎం నిరంజన్ ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేదిశగా కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమై అవసరాలు తెలుసుకుంటూ వారి సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణానికి తోడ్పాటునందించేవిధంగా ముందుకు పోతున్నారు. ఏప్రిల్ 12 చైత్ర పౌర్ణమి సందర్భంగా బద్వేల్ నుండి అరుణాచలంకు ప్రత్యేక అదునాతన డీలక్స్ బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని డిఎం తెలిపారు.

నాలుగవ సెమిస్టర్ ఫైనల్ టీచింగ్ ప్రాక్టీస్ ప్రాక్టికల్ పరీక్షలు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: డి.ఎల్.ఎడ్. (2023-25 బ్యాచ్) విద్యార్థుల సెమిస్టర్ నాలుగవ ఫైనల్ టీచింగ్ ప్రాక్టీస్ ప్రాక్టికల్ పరీక్షలు 15-04-2025 నుండి 17-04-2025 వరకు ఒకే విడతలో నిర్వహించబడనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ అజయ్ కుమార్ బాబు తెలిపారు.ఈ పరీక్షలు రాష్ట్రంలోని గవర్నమెంట్ డైట్ కాలేజీలు మరియు ప్రైవేట్ డి.ఎడ్. కాలేజీలలో అనుసంధానంగా జరుగుతాయని, సంబంధిత కళాశాలలు ఈ పరీక్షల నిర్వహణకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ సంబంధిత కాలేజీల నుండి పూర్తి సమాచారం తీసుకొని పరీక్షలలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

వడ దెబ్బ, క్షయ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - వాయల్పాడు: మండల పరిధిలోని బోయపల్లి గ్రామంలో స్వయం సహాయక బృంద సభ్యులకు డాక్టర్ జులేక బేగం, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీల ఆధ్వర్యంలో క్షయ, కుష్ఠు, ఎయిడ్స్, సికిల్ సెల్ రక్తహీనత, రక్తదానం, వడ దెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతు రెండు వారాలకు పైబడి దగ్గు ఉండుట, ఆయాసం, ఛాతిలో నొప్పి, దగ్గినపుడు గళ్ళ వచ్చుట, రక్తం గళ్ళ లో కన్పించడం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం వంటి లక్షణాలు ఉంటే అది టిబి జబ్బు అని అనుమానించి సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రం లో చూపించుకోవాలి. విచ్చలవిడి శృంగారం హెచ్ఐవి ఎయిడ్స్‌కు నాంది. జీవిత భాగస్వామి తోనే లైంగిక జీవితం గడ పాలని అన్నారు. నొప్పి, నవ్వ, స్పర్శ లేని మచ్చలు కుష్ఠు వ్యాధి కావచ్చు కావున సమీప ఆరోగ్య కేంద్రం లో ఇటువంటి మచ్చలు ఉన్న వారు పరీక్ష చేయించుకుని ఒకవేళ నిర్ధారణ ఐతే చికిత్స పూర్తిగా ఉచితంగా ఇస్తామని అన్నారు. రక్తదానం అన్ని దానాలలోకెళ్ళ పవిత్ర మైనది. 18సంవత్సరాల పైబడిన వారు అందరు రక్తదానం చేయవచ్చు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చును. రక్తదానం చేయ డానికి యువత ముందుకు రావాలాన్నారు. ఉదయం 11గం నుండి సాయంత్రం 4గం వరకు ఎండలో తిరగడం లేదా పనులు చేయరాదని తెలిపారు. కూలి పనులు ఉదయం ఆరు గం నుండి పది గం వరకు సాయంత్రం నాలుగు గం పైన చేయాలని తెలిపారు. ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచుకొని వాడుకోవాలని తెలిపారు. ఓఆర్ఎస్ పాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ఎ అరుణ, అంగన్వాడీ కార్యకర్త కళ్యాతి, సంఘ మిత్ర రమణమ్మ మరియు సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సింపోజియంకు అపూర్వ స్పందన

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఉన్న శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం సాయి సాంకేతిక-2025 వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిఎన్ఎస్ అకాడమీ తిరుపతి డైరెక్టర్ శ్రీనివాసులు, విశిష్ట అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ రెడ్డి, శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కలిసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సదస్సుకు ఉమ్మడి కడప-చిత్తూరు జిల్లాల ఆదిత్య, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం, అన్నమాచార్య, గౌతమి, శ్రీనివాస వంటి వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు మొదటి సంవత్సరం అత్యంత కీలకమైందని, గణిత శాస్త్రం ప్రతి శాఖకు ఆధారభూతమని, గణితంపై పట్టు వలన సాఫ్ట్వేర్ రంగం, ఉద్యోగ పోటీపరీక్షల్లో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. గత 24 ఏళ్లుగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల రాయలసీమలో గోల్డ్ మెడల్స్, ప్రతిభ అవార్డుల రూపంలో యూనివర్సిటీ స్థాయిలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నదని తెలిపారు. ఈ టెక్నికల్ సింపోజియంలో మాథమాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మరియు ఇంగ్లీష్ విభాగాలలో మొత్తం 194 పత్రాలు సమర్పించబడ్డాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐటిటి ట్రేడ్ టెస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ ఉపాధి శిక్షణ శాఖా డైరెక్టర్ వారి ఆదేశానుసారం, నేషనల్ ట్రేడ్ సర్టిఫికేట్ పొందటకు వివిధ ట్రేడ్ లలో నైపుణ్యం కలిగి ప్రైవేటుగా పని చేసుకొనే అభ్యర్థులు ఐటిఐ, సర్టిఫికేట్ పొందుట కొరకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ప్రభుత్వ ఐటిఐ రాజంపేట ప్రిన్సిపాల్, కన్వీనర్ ఆర్.రఘురామి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అప్రెంటిస్ షిప్ ట్రైనింగ్ ఇస్తున్న కంపెనీలు, యంయస్ యంఇలు రిజిస్టర్ ఎస్టాబ్లిష్మెంట్ లలో కనీసం ఒకటి నుండి మూడు సంవత్సరాల అనుభవం కలిగిన అభ్యర్థులు ఒక ట్రేడ్ కలవారు వేరే ట్రేడ్ సర్టిఫికేట్ పొందుటకు అవకాశం కలదు. సంబందించిన వివరాలతో పాటు సర్వీస్ సర్ఫికేట్ ను తమ దగ్గర ఉన్న ప్రభుత్వ ఐటిఐలలో ఈ నెల 12వ తేదిలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఘర్షణలో కేసులో 9మంది నిందితుల అరెస్ట్: ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటి: గత మార్చి 31న పట్టణంలోని చెక్ పోస్ట్ శివాలయం వద్ద జరిగిన ఘర్షణ కేసులో 9 మంది ముద్దాయిలను అరెస్టు చేయగా 15 మంది పరారీలో ఉన్నట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఎస్పీ వివరాల మేరకు ముద్దాయిలలోని కొంతమంది సుమారు 2 రెండు సంవత్సరాల క్రితం అమ్మాయి విషయమై సదరు కేసులో పిర్యాది అయిన దేశముక్ ఇస్రాన్ అలీ ఖాన్ అను వర్గం వారిని రాయచోటి టౌన్ కొత్తపల్లిలో కొట్టి గాయపరిచినట్లు, సదరు విషయం మనస్సులో ఉంచుకొని అప్పటి నుండి ఇరు వర్గాల వారు తరుచూ గోడవలుపడుతూ కక్షలు పెంచుకొని, ముద్దాయిలు పిర్యాది అయిన దేశముక్ ఇస్రాన్ అలీ ఖాన్ వర్గంలో వారిని చంపాలనే ఉద్దేశంతో 31.03.2025వ తేది రంజాన్ పండుగ రోజు రాత్రి ముద్దాయిలు మోటార్ సైకిల్లలో చిత్తూరు రోడ్డులో గల శివాలయం చెక్ పోస్ట్ వద్దకు వెళ్లి దేశముక్ ఇస్రాన్ అలీ ఖాన్, రియాన్ అలీ ఖాన్, అహమ్మద్ బాషలపై కట్టెలు, రాడ్లు, చైన్ లతో దాడి చేసి గాయపరిచి అప్పటి నుండి పరారిలో ఉండగా, వారిలో 9 మందిని 10వ తేది రాయచోటి అర్బన్ ఇన్స్పెక్టర్ బివి చలపతి వారి సిబ్బంది సహాయంతో అరెస్ట్ చేయడం జరిగింది. అరెస్ట్ అయినవారిని కోర్ట్ లో హాజరు పరుస్తామన్నారు. పరారీలో ఉన్న మిగిలిన 15 మంది ముద్దాయిలను కూడా త్వరలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా గ్యాంగ్ లుగా ఏర్పడి, ప్రజాశాంతికి విఘాతం కల్గించే విధంగా ఘర్షణలకు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా యువకులపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రిపూట అనవసరంగా రోడ్లపై తిరగరాదని, మైనర్లు బైక్ డ్రైవింగ్ చేస్తే బైకును సీజ్ చేయడమే కాకుండా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. ఇప్పటికే ఇలా ఘర్షణలకు పాల్పడేవారిని వంద మందికి పైగా గుర్తించామని, వారందరినీ బైండోవర్ చేసి, కోర్టులో హాజరు పరుస్తామని, రౌడీ సీట్లు కూడా ఓపెన్ చేస్తామని, వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ముద్దాయిల వివరాలు

సయ్యద్ నూరుల్లా, సయ్యద్ బైతుల్లా, షేక్ ఖదీర్ అహ్మద్, షేక్ సుహైల్, షేక్ మన్సూర్ అలీ, షేక్ ఇర్ఫాన్, షేక్ ఇర్ఫాన్, షేక్ షారుక్, పటాన్ రియాజ్ అలీ ఖాన్.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మార్తల సుధాకర్ రెడ్డి



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మార్తల సుధాకర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1989 నుండి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్న మార్తల సుధాకర్ రెడ్డి 3 సార్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇదే కోర్టులో ఉన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడు సంవత్సరాలు పదవి కాలంలో కొనసాగుతారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన మార్తల సుధాకర్ రెడ్డిని బార్ అసోసియేషన్ సభ్యులు, తోటి లాయర్లు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలపై ధర్నా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఏపిపిటిడి(ఆర్టీసి) ఉద్యోగుల సమస్యల కొరకు గురువారం ఎన్ఎంయుఏ నాయకులు, ఉద్యోగులు ఆర్టీసి గ్యారేజ్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ నాయకులు వై.ఆర్‌కే రెడ్డి, నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండు రోజులు ఈ ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యోగుల భద్రత 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లను, అక్రమ రిమూవల్స్‌ను ఆపాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని తెలిపారు. గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈ.హెచ్.ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు పరచాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనాలన్నారు. 114జీవోలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లను 150 నుంచి 400వరకు చెల్లింపు చేయాలని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమస్థపరంగా వేతనాలు చెల్లించాలని, ఏపిఎస్ఆర్టీసిలో ఉన్న విధానాన్నే క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని, ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈ.ఓ.ఎల్ మంజూరు చేయాలని తెలిపారు. పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్స్ పాలసీని అమలు చేయాలన్నారు. ఆఫీస్ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలను అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ భానుప్రసాద్, గ్యారేజ్ సెక్రటరీ అశోక్‌కుమార్, జోనల్ నాయకులు, డిపో నాయకులు, ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-సంబేపల్లె: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కళాశాల ప్రారంభించడానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు మొదలైన వస్తువులు అందజేయాలని రాష్ట్ర విద్యాశాఖ గతంలో ఉత్తర్వులు జారీచేసింది. అందులో భాగంగా గురువారం సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో తొలివిడతలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 12 నోటు పుస్తకాలు అందజేయడం జరిగిందని ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ చెముదూరు దిలీప్ కుమార్ తెలియజేశారు. మిగిలిన పుస్తకాలు, ఇతర వస్తువులు త్వరలో వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదివి అధ్యాపకులకు, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఇంటర్మీడియట్ దశ జీవితంలో చాలా కీలకమైన దశ అని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవసరమైన కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం అధ్యాపకులతో కలిసి ఆయన విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

21న 6వ తరగతి ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-సంబేపల్లె: మోడల్ పాఠశాలలో ఈనెల 20వ తేదీ జరగవలసిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈస్టర్ పర్వదినం సందర్భంగా 21వ తేదీకి మార్పినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ గురువారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 164 మోడల్ పాఠశాలలో పరీక్ష తేదీని మారుస్తున్నట్లు ఉత్తర్వులు అందాయన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 21వ తేదీ పరీక్షకు హాజరుకావాలని తెలియజేశారు .పరీక్ష ఉదయం పదిగంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఓపి కోసం వచ్చి నిద్రపోతున్న రోగులు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: గురువారం ఉదయం 10 గంటలైనా స్థానిక 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్‌తో సహ ఒక్క డాక్టర్ కూడా లేరు. ఎంతో నమ్మకంతో వైద్యం కోసం వచ్చిన పేద గ్రామీణ వృద్ధులు, మహిళలు డాక్టర్ల కోసం ఎదురు చూస్తూ ఉండడం తప్ప ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. కొంతమంది రోగులు ఓపి కోసం వేచి వున్న 'క్యూ' లోనే నిద్రకు ఉపక్రమించారు. ఉదయం 9గంటలకు రావాల్సిన వైద్యులు, చాలా మంది సిబ్బంది 10గంటలైన రాకపోవడం దురదృష్టకరం. ఆసుపత్రి మీద, విధులకు సక్రమంగా రాని డాక్టర్ల మీద మీడియా పలుసార్లు అనేక కథనాలు ప్రచురించినప్పటికీ, జిల్లా వైద్య ఉన్నతాధికారులకు నేరుగా చెప్పినప్పటికీ ఈ ఆసుపత్రి డాక్టర్లల్లో, సిబ్బందిలో మార్పు రావడంలేదు, వీళ్లకు చీమ కుట్టినట్లు కూడా ఉన్నట్లు లేదు. ఈ బాధ్యత లేని డాక్టర్ల వల్ల బాధ్యతాయుతంగా, ఖచ్చితంగా పనిచేసే

ఒకరిద్దరు డాక్టర్లు కూడా విమర్శలు ఎదుర్కోవలసి వస్తోంది. సమస్యను డిఓ వెంకట నాగేంద్ర దృష్టికి తీసుకుపోగా.. నేను నైట్ డ్యూటీ చేశాను, డాక్టర్లకు ఫోన్ చేస్తాను అనడం జరిగింది. ఆయన కూడా ఏమీ చేయలేని పరిస్థితిలా కనిపిస్తోంది.

యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రానికి సమీపం లోని చెన్నంశెట్టి పల్లెలో వెలసిన శ్రీ యల్లమ్మ తల్లికి అదే ఊరికి చెందిన ఆంజనేయులు కుటుంబీకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చేనం శెట్టిపల్లె పురవీధుల్లో యల్లమ్మ తల్లి ప్రతిమ, పోతురాజు విగ్రహాలను డప్పు వాయిద్యాలు, బాణ సంచాల నడుమ ఊరికి నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో చేన్నంశెట్టి వెంకటరమణ, తోట రవీంద్ర, నాగేష్,భాస్కర్, వెంకటరమణ, సిద్ధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకై సీపీఐ ఆధ్వర్యంలో 3వ రోజు రిలే దీక్షలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఇండ్ల స్థలాలకై సీపీఐ రిలే దీక్షలు మూడవ రోజు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మాణం చేసినట్లుగా పట్టణ ప్రాంత పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, రైతు కూలీలకు రెండు ఎకరాలు సాగు భూమి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు భూ పంపిణీకై రాష్ట్రంలో అదనంగా భూములను కొనుక్కోవాల్సిన అవసరం లేదని, రాజకీయ నాయకులు, కొంతమంది అవినీతి రెవెన్యూ అధికారులు కలిసి డికెటి భూములను, దళిత, గిరిజన, ఆదివాసీలకు చెందిన భూములను, వాగు, వంక, పోరంబోకు, డీ నోటిపై భూములు అమ్ముకొని సొమ్ము చేసుకున్నవి, అక్రమణ దారుల చేతుల్లో మిగులు భూములు లక్షల ఎకరాల్లో ఉన్నాయని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసి పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి, విద్యుత్ సంస్థలు సెకితో చేసుకున్న ఒప్పందం న్యాయబద్ధమైంది కాదని కోర్టు కెక్కిన వీరు ఇప్పుడు అంగీకరిస్తూ ఒప్పందం కుదుర్చుకున్నారు. పర్యవసానంగా లక్షా యాభై వేల కోట్లు ప్రజలపై భారం పడేలా రంగం సిద్ధం చేశారు. గ్యాస్ ధరలు పెంచమని హామీ ఇచ్చి నేడు సిలిండర్‌పై 50రూపాయలు పెంచారని, గతంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తానని చెప్పి మాట నిలబెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు అసెంబ్లీలో తీర్మాణం చేసిన విధంగా పేదలకు రెండు సెంట్లు, మూడు సెంట్లు ఇస్తారనే గ్యారెంటీ కనబడటం లేదన్నారు. ఒకవేళ కట్టుబడి ఉంటే ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారో, ఎంతవరకు వచ్చిందో బహిర్గతం చేయాలన్నారు. లేని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడులు చేపడతామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో సీపీఐ ఏరియా సమితి నాయకులు గోపాలం రామకృష్ణ, వై.హరి, మద్దిలేటి, మచ్చ శ్రీను, దేవరశెట్టి నరసింహ, మీరావల్లి, నాయబ్ రసూల్, చెన్నమ్మ, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి నాని, తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చండీ హోమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం(శివాలయం)లో 12న శనివారం (రేపు) పూర్ణిమ సందర్భంగా ఉదయం 6గంటలకు చండీ హోమం జరుగుతుందని ఆలయ ఈఓ కే.రామచంద్రాచార్యులు, ఆలయ చైర్మెన్ కొత్తమిద్దె రఘురామి రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. కనుక ఆసక్తి ఉన్న భక్తులు ఈ హోమములు చేయించుకొని స్వామి, అమ్మవార్ల అనుగ్రహం పొందగలరని అన్నారు. ఈ హోమాలు చేయించుకోవాలి అనుకున్నవారు ముందుగా ఆలయ కార్యాలయంలో రుసులు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోకారు.

సేవే లక్ష్యం: ఎన్ఆర్ఐ కెకె రెడ్డి

విశాలాంధ్ర-నందలూరు: ఉద్యోగ రీత్యా ఎల్లలు దాటినా, సేవే లక్ష్యం గా భావిస్తూ తాను అమెరికాలో ఉన్నప్పటికీ జన్మనిచ్చిన గ్రామానికి, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఉచిత తాగునీటి మినరల్ కేంద్రాలతో పాటు, దేవాలయాల నిర్మాణం, పునరుద్ధరణ విరివిగా చేపట్టడం జరిగిందని ఎన్నారై కె.కె.రెడ్డి అన్నారు. మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ నాగిరెడ్డిపల్లి తోటపాలెంలో మన్నూరు రామలక్ష్మమ్మ, నారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ఎన్నారై కె.కె.రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కారంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు, తోటపాలెంలో మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం విశ్వా వసునామా భక్తి పంచాంగాలను ఆవిష్కరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మద్దికేర ఓబులేసు, రాజంపేట రూరల్ సీఐ రమణ నందలూరు ఇంచార్జ్ ఎస్సై మోహన్ కుమార్ గౌడ్, నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, శివరామి రెడ్డి, కృష్ణా రెడ్డి, జంబు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

విశాలాంధ్ర-నందలూరు: నందలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198 వ జయంతి సందర్భంగా నాగిరెడ్డిపల్లి పంచాయతీ కూడలిలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతి గా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం జీవితం ధార పోసిన మహనీయుడని, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కొరకు ఉద్యమాలు నడిపిన ధీరుడు, ప్రతి ఒక్కరూ చదువుకొని విద్యనే ఆయుధంగా మలుచుకోవాలని చాటిచెప్పిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణి యాదవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు,వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోదపోతుల రాము, వాకర్స్ సెక్రటరీ ఉప్పుశెట్టి సుధీర్, గంధం గంగాధర్, అల్లం అశోక్ కుమార్, నరసింహ శెట్టి శెట్టి, మంటి మారయ్య, యంబలూరు నరసింహస్వామి, జంగం శెట్టి హరి, ఆంజనేయులు తదితరులు నివాళులర్పించడం జరిగింది.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎమ్ రిలీఫ్‌ఫండ్ చెక్కులను గురువారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి అందజేశారు. ఈ సందర్భంగా తొండూరు మండలం మదూరు గ్రామంలో పల్లె భూదేవికి రూ.23,920.00ల చెక్కును వారి స్వగృహానికి వెళ్లి అందజేశారు. అలాగే తొండూరు మండలం మల్లెల, మదూరు గ్రామాలతో పాటు ప్రొద్దుటూరు పట్టణంలోపూ రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమన్నారు. పేదల ఆరోగ్య సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆమె వెల్లడించారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ సర్కిల్ నందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం సందర్భంగా అన్నదాన కార్యక్రమము కోలాటంతో జయంతిని ఘనంగా జరుపుకొనుటకు నాలుగు మండలాల దళిత సంఘం నాయకులు ప్రజాసంఘం నాయకులు ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం నాయకులు కార్మిక సంఘం నాయకులు అందరూ పాల్గొని 134వ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆహ్వానిస్తున్నామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సేవ సమితి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల ప్రసాద్ రావు, బండి ఓబులేసు, కే రాఘవ, జై కిరణ్. పాపయ్య. టీచర్ జి శ్రీనివాసులు. పుల్లయ్య. చిన్న రాయుడు. చిన్న. రాజు. పుల్లయ్య. ఎల్ మల్లికార్జున. ఎన్ వీరయ్య. రాజు. ఇండ్ల రామసుబ్బయ్య. జి శంకరయ్య. ఇళ్ల చరణ్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి-సిపిఐ

విశాలాంధ్ర-జమ్మలమడుగు: ములిగే నక్క పై తాటికాయ పట్టేట్టుగా పేద,మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి బాగాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొం టుంటే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై పెనుభారం మోపిందని సిపిఐ జమ్మలమడుగు కార్యదర్శి ప్రసాద్,చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు, గురువారం జమ్మలమడుగు పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయం గ్యాస్ సిలిండర్ తో ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్,డీజిల్ పై రెండు రూపాయలు మరియు గ్యాస్ పై 50 రూపాయలు పెంచి పేద ప్రజల పై భారం మోపిందని వారన్నారు ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని చెబుతూనే మరోపక్క పెట్రోల్ డీజిల్ నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం కాలం కావస్తున్న ప్రజలకు ఒరిగిందేమీ లేదని వారన్నారు. నరేంద్ర మోడీ ప్రధాని అయినప్పటి నుండి కూడా ఈ దేశ ప్రజానీకానికి ఒరిగిందేమీ లేదని వారన్నారు. పెంచిన పెట్రోల్,డీజిల్ మరియు గ్యాస్ ధరలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాంప్రసాద్, నాగేంద్ర, సంతోష్, శివ, ధనుష్, ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన ఆంధ్రప్రదేశ్ ఖాది పరిశ్రమల ఛైర్మన్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: రాష్ట్ర రాజధాని అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాది మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ ఛైర్మన్ కస్తూరి కోటేశ్వరచౌదరి (కెకె)కలసి పరిశ్రమల ఏర్పాటు పై సుధీర్ఘంగా చర్చించారు. ఖాది గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటు చేసి వాటి ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుందామని ప్రధానమైన కీలక అంశాలను కెకె ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి వివరించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కెకె పాత్రికేయులకు తెలిపారు. త్వరలో నిరుద్యోగ యువతీ యువకులకు మహర్దశ రానున్నది. గతంలో కూడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాది గ్రామీణ పరిశ్రమల శాఖ బోర్డు అధికారులతో ప్రధాన కీలక అంశాలపై చర్చించారు.

కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడి కార్మిక చట్టాలు అమలు చేయాలి

ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఆప్కాస్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఎన్ఆర్ఎంలకు ఉద్యోగ విరమణ వయసు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరే 62 ఏళ్లకు చేయకుండా 60 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని జీవో నంబరు15 నీ కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హెూచిమిన్ భవన్ యందు జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి కార్పొరేట్ యాజమాన్యానికి తలొగ్గి పెంచేందుకు పాలక ప్రభుత్వాలు ముందుకు రావడం బాధాకరం అన్నారు.రాష్ట్రంలో ఆప్కాస్ ద్వారా ప్రతి నెలా ఒకటవ తేదీన జీతం వస్తుందని, పిఎఫ్, ఇఎస్ఐ, వాటా నిధులు సక్రమంగా కార్మికుల ఖాతాలలో జమ అవుతున్నాయన్నాయని ప్రస్తుతం తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆప్కాస్ తొలగించి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ప్రయత్నాలలో మంత్రుల కమిటీ అని చెప్పి ముఖ్యపెట్టే వార్తలు వస్తున్నాయని ఇదే జరిగితే క్రమం తప్పకుండా ఒకటవ తేదీన వేతనం అనకుండా పిఎఫ్. ఇఎస్ఐ డబ్బులు సక్రమంగా ఖాతాల్లో జమకావని, నిత్యం వేధింపులు, బెదిరింపులు, అక్రమ తొలగింపులు పెరిగి అవస్థలు పడాల్సి వస్తుందనీ తెలిపారు. కనీస వేతనాల బోర్డు ఏర్పాటు చేసి 73 షెడ్యూల్లోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్కీం లలో పనిచేస్తున్న అంగన్వాడీ ఆశా మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి సామాజిక భద్రతా చట్టంలో భాగంగా పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలు అమలు అయ్యేటట్లు చూడాలన్నారు.అసంఘటిత రంగ కార్మికులకు ఆటో హమాలి వీధి విక్రయ దారులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి భవన నిర్మాణ సంక్షేమ మండలి కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా ఉపాధ్యక్షులు చాంద్ భాష, కార్యదర్శిలు లింగన్న మస్తాన్ జిల్లా సమితి సభ్యులు చంద్రశేఖర్ వివిధ ప్రజా సంఘాల నాయకులు రామాంజనేయులు కామాక్షి సులోచనమ్మ సురేష గఫార్ తారక రామారావు నగేష్ నరసింహులు రామసుబ్బారెడ్డి ప్రసాదు రత్నమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవికుమార్ అంబేద్కర్ అవార్డుకు ఎంపిక

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండ లం ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పెనుగొండ రవికుమార్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సౌత్‌రన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలి పారు. 12 సంవత్సరాల నుండి ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అంకితభావముతో క్రియాశీలకంగా పనిచేస్తూ ట్రిపుల్ఐటీ అభివృద్ధికి పాటుపడుతూ, అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన జపాన్ లోని ఏఐజెడ్‌యు యూనివర్సిటీ లో పరిశోధనలు చేసి, సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగంలో విశేషమైన కృషి చేసినందుకు గాను ఆయన విలువైన సేవలను గౌరవిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డు కు డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారంను ప్రధానం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సంద్ర, వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ అభినందనలు తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: ఆంధ్రప్రదేశ్ వెంకటరామన్న గూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యోగుల (బోధనేతర) సంక్షేమ సంఘంకు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మజ్జిగ చంద్రశేఖర్‌కు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శోడిశెట్టి వెంకటేశ్వర రావు కు గురువారం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ప్రాంగణంలో అసోసియేట్ డీన్ డాక్టర్ పిటి శ్రీనివాసులు అధ్వర్యంలో శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమం సందర్భంగా ఉద్యాన కళాశాలలో పండగ వాతావరణం ఏర్పడింది.ఈ సందర్భంగా అధ్యక్షులు మజ్జిగ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన, కృషి చేసిన ఉద్యోగులకు, బోధనేతర ఉద్యోగులకు అందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.బోధనేతర ఉద్యోగులకు అండగా నిలబడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్ సిబ్బంది డాక్టర్ టివి సురేంద్రనాథ్ రెడ్డి, కళాశాల ఉద్యోగులు, బోధనేతర ఉద్యోగులు, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు. బోధనేతర ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ శివశంకర్,సంయుక్త కార్యదర్శి మల్లిఖార్జునరావు, కోశాధికారి నిరీక్షణరాజు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు.

మాజీ సీఎంను కలిసిన జిల్లా ఛైర్మన్, వైసిపి నేతలు

విశాలాంధ్ర- బ్రహ్మంగారి మఠం : మండల సభ్యులు, కడప జిల్లా జిల్లా పరిషత్ ఛైర్మన్ గా చేపట్టి ముత్యాల రామ గోవిందరెడ్డి రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి, వైయస్ జగన్మోహన్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు శాలలతో సత్కరించారు, వీరితోపాటు మాజీ మాజీ శాసనసభ్యులు, శెట్టిపల్లి రఘురామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సమూటూరుప్రసాద్ రెడ్డి, దువ్వూరు మాజీ జెడ్పిటిసి సభ్యులు, గుడిపాడు బాబు బ్రహ్మంగారిమఠం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, ముత్యాల శ్రీనివాసులు రెడ్డి కలిసి పూలమాలలు చాలాలతో సత్కరించి జిల్లా రాజకీయాలు అయినా చర్చించారు ప్రస్తుతం మైదుకూరు నియోజకవర్గంలో రాజకీయాల పట్ల చర్చించారు రాబోయే 2029 ఎన్నికలను ఉద్దేశించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ప్రజల సమస్యల పైన వైసిపి పార్టీ తీతుగా నిలబడి సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని వారికి తెలిపినట్లు సమాచారం తెలిసింది కడప జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయాలని మండల స్థాయి నుండి గ్రామస్థాయి నియోజకవర్గ స్థాయి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకర్తలు నాయకులు దీటుగా నిలబడా లన్నారు వారికి సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-వల్లూరు: వల్లూరు అంకాలమ్మ తిరునాల మహెూత్సవం సందర్భంగా ముదిగోటి పెద్ద వెంకటసుబ్బయ్య,లక్ష్మీదేవి, రేణుక పాలకేంద్రం సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. రేపటి కోసం ఆర్గనైజ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ అంజి మాట్లాడుతూ వేసవికాలంలో భక్తులకు దాహార్తిని తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. మజ్జిగ అందించిన దాతని పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఆకేటి వెంకట్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోహినీ అలంకారంలో జగన్మోహనుడు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం ఉదయం మోహినీ అలంకారంలో రాములవారు జగన్మో హనాకారుడిగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. మోహినీ అవతార వృత్తాంతం భాగవతంలో రమణీయంగా వర్ణింపబడింది. దేవతలు, రాక్షసులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథిస్తారు. చివరికి వారు కోరుకున్న అమృతం లభిస్తుంది. దానిని పంచుకోవడంలో కలహం ఏర్పడుతుంది. ఆ కలహాన్ని నివారించి, దేవతలకు అమృతాన్ని పంచడానికి శ్రీహరి మోహినీ రూపంతో సాక్షాత్కరిస్తాడు. తనకు భక్తులు కానివారు ఆ మాయలో ఉంటారనీ తనకు ప్రసన్నులైనవారు మాయను సులభంగా దాటగలరనీ ఈ మోహినీ రూపంలో రాములవారు ప్రకటిస్తున్నారు. వాహన సేవలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యాయమార్గమే కాంగ్రెస్ లక్ష్యం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి మాట్లాడుతూ అహ్మదాబాద్లో ముగిసిన 86వ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పలు కీలక తీర్మానాలను ప్రకటించింది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రధాన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా వారు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణపై కాంగ్రెస్ పార్టీ యొక్క నిబద్ధతను స్పష్టంగా వెల్లడించారు.రాహుల్ గాంధీ పేర్కొన్న ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. సమాజంలో సామాజిక న్యాయం అమలు కావాలంటే కుల గణన అత్యవసరం. 50% రిజర్వేషన్ పరిమితిని తొలగించాలన్న డిమాండ్ను పునరుద్ఘాటించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, ఇది మత స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. సమాజంలో ధార్మిక గందరగోళాన్ని పెంచే ప్రయత్నం: ముస్లింలు మరియు క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను భయభ్రాంతుల్లోకి నెట్టడం పెద్ద నేరమని రాహుల్ గాంధీ విమర్శించారు. సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు పార్లమెంట్లో డ్రామాలు: దేశానికి ఎదురవుతున్న అసలు సమస్యలపై చర్చకు మళ్లించకుండా బీజేపీ ప్రభుత్వం కల్పిత వ్యవహారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో "న్యాపథ్" (న్యాయ మార్గం) అనే పేరుతో తీర్మానం ఆమోదించబడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశభక్తి భావన అనేది ప్రజలను ఏకం చేసే విలువలపై ఆధారపడి ఉండన్నారు. దేశాన్ని విభజించే బీజేపీ విధానాలను ప్రజలు గుర్తించాలనే విజ్ఞప్తిని ఏఐసీసీ చేసిందన్నారు. ఈ సమావేశంలో కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, సయ్యద్ గౌస్ పీర్, అబ్దుల్ సత్తార్, మైనుద్దీన్, సంజయ్ కాంత, హమీద్, ఖాదర్ ఖాన్, రహమతుల్లా ఖాన్, షేక్ నీలం, సిరాజుద్దీన్, కమల్ బాషా, ముబారక్, హరిప్రసాద్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

విశాలాంధ్ర-కడప క్రైం : ఈ నెల 11 న శుక్రవారం ఒంటిమిట్ట లో జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడప నగరంలో, ఒంటిమిట్ట రహదారి, రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు అమలులో ఉంటుందని జిల్లా ఎస్.పి శ్రీ ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్.పి గారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. మళ్లింపు ఈ నెల 11 వ తేదీ ఉదయం నుండి 12 వ తేది ఉదయం వరకూ అమలులో ఉంటుందని తెలిపారు.ఈ.కార్యక్రమ నిర్వహణ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాతీయ రహదారి 716 మీదుగా వచ్చు భారీ వాహనాలను రేణిగుంట, రాజంపేట, కడప వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల ద్వారా 716 – జాతీయ రహదారి మీదుగా కాకుండా ఇతర మార్గాలలో 11వ తేది ఉదయం 06:00 గం.ల నుండి 12వ తేది ఉదయం 10 గం.ల వరకు దారి మళ్లించడం జరుగుతుంది. రాజంపేట వైపు నుండి వచ్చు ద్విచక్ర వాహనాలు, ఆర్.టి.సి. బస్సులు ఒంటిమిట్ట మండలం సాలాబాద్ క్రాస్ వద్ద మరియు సిద్దవటం మండలం ఉప్పరపల్లి సాయిబాబా గుడి వద్ద 11 వ తేది మధ్యాహ్నం 12:00 గం.ల నుండి 12 వ తేది ఉదయం 10 గం.ల వరకు దారి మళ్లించడం జరుగుతుందని ఎస్.పి తెలిపారు. కడప నుండి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్ పల్లి ఇర్కాన్ జంక్షన్ నుండి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్ళాలి. తిరుపతి నుండి కడప వైపు వచ్చే భారీ వాహనాలు, రవాణా వాహనాలు రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి. రాజంపేట వైపు నుండి కడప వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లింపు. రాజంపేట వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహనాలు సాలాబాద్ నుండి ఇబ్రహీం పేట, మాధవరం మీదుగా పంపబడును. 18 చోట్ల పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు!శ్రీ సీతారామ కళ్యాణానికి రాజంపేట వైపు నుండి వచ్చే భక్తులు టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను సాలాబాద్ సమీపంలో 5 చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో క్రమపద్ధతిలో నిలపాలి. కళ్యాణ వేదిక నుండి కడప మార్గంలో 13 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగింది.

పేదోళ్ళ సొంతింటిపై చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వం

- అర్హులైన వారందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వాలి
- లబ్ధిదారులకు టిడ్కో ఇండ్లు ఎప్పుడు ఇస్తారో !
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి

విశాలాంధ్ర – జమ్మలమడుగు: పేదవాడి ఇళ్ల గురించి గొప్పగా చెప్పే పాలకులు చేతల్లో విఫలమవుతున్నారని, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇళ్ల సమస్యలను నిర్దిష్ట కాలపరిమితితో పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయం నందు ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ నేతృత్వంలో అర్హులైన వారందరికీ రెండు సెంట్ల ఇళ్ళ స్థలాలు, టిడ్కో ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ళు లేని పేదలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇండ్ల స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, పెండింగ్ పనులను పరిపూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులందరికీ టిడ్కో ఇండ్లు వెంటనే స్వాధీనం చేయాలని సిపిఐ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టిందన్నారు. ప్రభుత్వం టిడ్కో సంస్థ ద్వారా ఇండ్లు నిర్మాణం చేపట్టినా గత జగన్ ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు అందజేయలేదని ఇప్పటికైనా టిడ్కో ఇండ్లు లబ్ధిదారులకు అందజేసి న్యాయం చేయాలన్నారు. టిడ్కో లబ్ధి దారులందరూ వేలు, లక్షలు డిపాజిట్లు చెల్లించి బ్యాంకు లోన్లు చెల్లించుకుంటూ బాడుగ ఇళ్లల్లో ఏళ్ళ తరబడి నివసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్లు ,ఇంటి స్థలాలు లేక చాలామంది పేదలు బాడుగ ఇండ్లలో ఉంటున్నారని అర్హులను గుర్తించి ఇండ్లు ఇంటి స్థలం మంజూరు చేయాలని ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించిందని అయితే కొన్ని షరతులు ఉన్నాయని అర్హులైన పేదలందరికీ షరతులు లేకుండా ఇంటి స్థలం ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఈ విషయంపై గత నెలలో అన్ని మండల రెవెన్యూ, జిల్లా కలెక్టర్ కు అర్జీలు సిపిఐ ఆధ్వర్యంలో అందజేశామని అర్జీలు అన్నింటినీ పరిశీలించి అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సచివాలయం పరిధిలో, తాహసిల్దార్ కార్యాలయాల్లో, అధికారులు పేద ప్రజల నుంచి ఇళ్ల స్థలాలు అర్జీలు స్వీకరించే కార్యక్రమం చేపట్టాలన్నారు. పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల మూడు సెంట్లు అర్హులైన వారందరికీ ఇవ్వడానికి ఇప్పటి నుండే స్థల సేకరణ చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ లేఅవుట్ కాలనీలల్లో సెంటు స్థలాల్లో ఇళ్లలు నిర్మించుకున్న వారి సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయని, వాటి పట్ల కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పేదోళ్ల ఇళ్ల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి ప్రకాశం, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నయ్య, నరసింహులు, సిపిఐ నాయకులు ప్రసాదు, లక్ష్మీనారాయణ, మధు, వెంకటరమణ, శ్రీనివాసులు, రాంప్రసాద్, నాగేంద్ర, రంగనాయకులు, సుబ్బన్న, సంతోష్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోదండ రామ స్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టిటిడి ఈవో జె శ్యామల రావు వెల్లడించారు. కల్యాణ వేదిక ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, శ్రీవారి సేవకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, గ్యాలరీలలో ఉండే భక్తులకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసిన కల్యాణ తలంబ్రాలు, స్వామి వారి ప్రసాదం, అన్నప్రసాదాలను క్రమపద్ధతిలో అందించాలని సూచించారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వాహనాల పార్కింగ్, గ్యాలరీలోకి భక్తుల ప్రవేశం, నిష్క్రమణలో క్రమపద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టిటిడి ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామి వారికి గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. స్వామి వారి మీద భక్తితో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న శ్రీవారి సేవకులను ఈవో అభినందించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులతో సంయమనంతో ఉండాలని పోలీసులను కోరారు. గ్యాలరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో హర్షవర్ధన్ రాజు, టిటిడి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ఐసిటి ల్యాబ్ ప్రారంభం

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: అన్నమయ్య జిల్లాలోని రాయచోటి డైట్ కళాశాలలో ఆధునిక సాంకేతికతకు తోడ్పాటుగా ఐసిటి (ఐసీటీ) కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ ల్యాబ్ను రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీ వీరభద్రారెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ, "పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, వీడియోలు, అనిమేషన్ల ద్వారా పాఠాలను ఆసక్తికరంగా బోధించవచ్చు. గణిత, శాస్త్రం, భౌగోళికం వంటి విషయాలలో విజువల్ డెమాన్‌స్ట్రేషన్లు అందించడం సులభం" అని పేర్కొన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, "ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్స్ (అప్‌లు, గేమ్స్, క్విజ్‌లు) ద్వారా విద్యార్థుల ఆసక్తి పెరుగుతుంది. వారు స్వయంగా పరిశోధించి నేర్చుకునే అవకాశం లభిస్తుంది" అని చెప్పారు.డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ అజయ్ కుమార్ మాట్లాడుతూ, "డిజిటల్ టెస్టులు, ఈ-పుస్తకాలు, సిమ్యులేషన్ల ద్వారా అభ్యాసాన్ని మెరుగుపరచవచ్చు. విద్యార్థుల ప్రగతిని ఆన్లైన్ ద్వారా గుర్తించి, వారికి సరైన మార్గనిర్దేశనం చేయవచ్చు" అని తెలిపారు.ఐసిటీ లెక్చరర్ అసదుల్లా మాట్లాడుతూ, "టెక్నాలజీ ద్వారా ఉపాధ్యాయులు నూతన బోధన విధానాలు, శైలీలను వంటి ప్లాట్‌ఫామ్లు ద్వారా శిక్షణ పొందవచ్చు" అని వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శివ భాస్కర్, రెడ్డప్ప రెడ్డి, జాఫర్, రెడ్డయ్య, నాగేశ్వరరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటకలో అవార్డు రావడం పట్ల వెల్లువెత్తుతున్న ప్రశంసలు

విశాలాంధ్ర – రైల్వేకోడూరు : అన్నమయ్య జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖ సీనియర్ నాయకులు ఉమ్మడి జిల్లా కో ఆప్షన్ సభ్యులు వైఎస్ అన్సర్ భాష మనవడు, ఎంపిటిసి రౌఫ్ కుమారుడు ఫర్దిన్ అహ్మద్, సతీమణి తస్మియా తాజ్ ఇద్దరు ఇంటీరియల్ బిజినెస్‌లో అత్యంత ప్రతిభను ప్రదర్శించి బెంగుళూరులో ప్రముఖ సినీనటుల చేతుల మీదుగా చిన్న వయసులోనే కర్ణాటక బిజినెస్ ఎక్స్ లెంట్ అవార్డు అందుకుని చరిత్ర సృష్టించారు. కర్ణాటకలో జరిగిన పెద్ద కార్యక్రమంలో ప్రముఖ సినీనటులు పర్దీన్ అహ్మద్‌కు, సతీమణి తస్మియా తాజ్‌కు అవార్డు అందజేసి అభినందించారు. భార్య, భర్తల ఇద్దరి కృషికి ఫలితం లభించింది. రౌఫ్ కుమారుడు పర్దీన్ అహ్మద్, కోడలు తస్మియా తాజ్ అవార్డు అందుకున్న శుభ సందర్భంగా స్థానికుల నుండి, బంధువుల నుండి, అభిమానుల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు ఒంటిమిట్ట కోదండ రామయ్య కళ్యాణం

- సీఎం చంద్రబాబు రాకకు ముస్తాబైన ఏకశిలా నగరం లక్షలాది భక్తుల రాక
- భద్రతా ఏర్పాట్లకు 3000 మంది పోలీసులతో బందోబస్తు
- కళ్యాణ వేదిక వద్ద 147 గ్యాలరీలు, 23 ఎల్ఈడీ స్క్రీన్‌లు
- వాహనాల రాకపోకల కోసం మార్గమార్పులు
- అందుబాటులోకి 20 ఉచిత బస్సులు
- అన్నదానంతో పాటు లడ్డూ ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు
- ముత్యాల తలంబ్రాలకు 23 కౌంటర్ల ఏర్పాటు
- విద్యుత్ దీపాలతో ఆలయం కాంతుల హరివిల్లు
- లైటింగ్ ప్రత్యేక ఆకర్షణ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: రెండో అయోధ్యగా విరాజిల్లుతున్న ఒంటిమిట్టలో జరగుతున్న శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఏప్రిల్ 11న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

విశేష వసతులు - కల్యాణ వీక్షణం అందరికీ అందుబాటులో

భక్తులు నిరవధికంగా కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు కళ్యాణ వేదిక వద్ద 147 గ్యాలరీలు, 23 పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్యాలరీకి ప్రత్యేక అధికారిని నియమించి భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేశారు. 130 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉచిత బస్సుల ద్వారా మలకాటి పల్లె, ఇతర పార్కింగ్ ప్రాంతాల నుండి భక్తులను వేదికకు చేర్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, శుద్ధి జల పంపిణీ కేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉన్నాయి.

సహకారంతో ముందుకు - సమన్వయంతో విజయవంతం

టిటిడి, జిల్లా యంత్రాంగం, స్థానిక వాలంటీర్లు, సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడడమే లక్ష్యంగా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టారు. భక్తులు ముందస్తుగా రావడం, సూచించిన మార్గాలను అనుసరించడం ద్వారా వేడుకలను ప్రశాంతంగా అనుభవించవచ్చని అధికారులు విజ్ఞప్తి చేశారు. టిటిడి, జిల్లా యంత్రాంగం, స్థానిక వాలంటీర్లు, సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడడమే లక్ష్యంగా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టారు. ఈ విధంగా ఒంటిమిట్టలో శ్రీరాముని కళ్యాణాన్ని ప్రత్యక్షంగా దర్శించాలన్న కోరికతో భక్తులు పోటెత్తుతున్న వేళ, అధికార యంత్రాంగం అన్ని కోణాల్లోనూ సిద్ధంగా ఉండటం గమనార్హం.

ముత్యాల తలంబ్రాలు, ప్రసాద పంపిణీకి 28 కౌంటర్లు

భక్తులకు 70 వేల లడ్డూ ప్రసాదాలు ప్రత్యేక ప్యాకింగ్‌లో సిద్ధమయ్యాయి. శ్రీవారి సేవకులతో ముత్యాల తలంబ్రాలు భక్తులకు అందించేందుకు ఇప్పటికే ప్యాకింగ్ చేశారు, కళ్యాణోత్సవ రోజున ప్రత్యేక కౌంటర్ల ద్వారా అన్నదానాన్ని విస్తృతంగా నిర్వహించనున్నారు. శ్రీరామనవమి నుంచి అన్నదాన కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ఆలయం చుట్టూ ప్రత్యేకంగా అలంకరించిన విద్యుత్ దీపాలు దీపావళి వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

భద్రత, రవాణా, సౌకర్యాలపై విస్తృత చర్యలు

భక్తుల పెద్దఎత్తున రాకపోకల నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, టిటిడి, ఆర్టీసీ, విద్యుత్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయి. దాదాపు 3000మంది పోలీసులు విధుల్లో నిమగ్నమవ్వగా, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. కడప నుండి తిరుపతి వైపు వెళ్లే వాహనాలను సాయి నగర్, బాపనపల్లి, గంగపేరూరు, రాచపల్లి మీదుగా మళ్లిస్తున్నారు. రాజంపేట వైపు నుంచి వచ్చే వాహనాలను కూడా మలకాటి పల్లె, రాచపల్లి మార్గాల ద్వారా మళ్లించనున్నారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రత్యేక చర్యలు

బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక బృందాలను నియమించింది. అవసరమైన చోట అదనపు జనరేటర్లు, బ్యాకప్ లైట్లు సిద్ధంగా ఉంచారు. కళ్యాణ వేదిక, ఆలయ ప్రాంగణం, ఎల్ఈడి స్క్రీన్ లు, ట్రాఫిక్ నియంత్రణ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సిబ్బంది రౌండ్ ది క్లాక్ విధుల్లో ఉన్నారు.

లక్ష్య సాధనే మా లక్ష్యం.. ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: లక్ష్య సాధనే లక్ష్యంగా పని చేసి ఇచ్చిన ప్రతి హామీ దశల వారీగా నెరవేరుస్తామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండలంలోని కొర్లకుంట, పున్నాటివారపల్లి, గాదెల వెంకట్రాంపురం తదితర గ్రామాలలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా కోట్లాది రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను గురువారం పండుగ వాతావరణంలో ఎమ్మెల్యే, ఛైర్మెన్ ఇద్దరు కూటమి నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదురవుతున్న సవాళ్లను సమర్దవంతంగా ఎదుర్కొంటాం అన్నారు. ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికలలో చారిత్రాత్మక తీర్పు ఇచ్చి గెలిపించారన్నారు. అ రుణం తీర్చుకుంటామన్నారు. ప్రజల,కూటమి నాయకుల, కార్యకర్తల, మహిళల సహకారంతో నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామన్నారు. అందరం కలసి కట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆశయాలను నెరవేరుద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, తనయులు యువ

నాయకులు ముక్కా సాయివికాస్ రెడ్డి, పంచాయితీరాజ్ డిఇఇ తిప్పన బాల నరసింహులు, ఎఇ ఆంనేయప్రసాద్, ఎంపిడిఓ మల్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, పొన్నాటి వాసుదేవరెడ్డి, సింగమాల రఘునాధరెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, తనయులు చరణ్, పిఎస్ వేణు,గంగరాజు వెంకటేశ్వరరాజు, జోగినేని మణి, పిసిఎన్ బ్రదర్స్ పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, వేమన సుబ్రమణ్యం నాయుడు, కల్లా చలపతి, గునిపాటి చెన్నరాయుడు, తల్లెం రమణారెడ్డి, కమతం నాగరాజు, బొక్కసం చలపతి, తిరుపతి శేఖర్, ఎస్ఐ మహేష్ నాయుడు, సుబ్బరామిరెడ్డి, వరికూటి నాగరాజు, సాలవ రమణరాజు, ముప్పాల రాజశేఖర్ రాజు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయండి

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లి ప్రభాకర్

విశాలాంధ్ర-కడప రూరల్: అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు జయప్రదం కోరుతూ కడప జిల్లా కేంద్రంలోని వైయస్సార్ ప్రెస్ క్లబ్ నందు శనివారం ఏఐవైఎఫ్ అధ్వర్యంలో జరుగుచున్న నిరుద్యోగ సదస్సులో యువత పాల్గొని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లి ప్రభాకర్ యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ 2014 ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు విడుదల చేసి 10 ఏళ్లలో నిరుద్యోగమే లేకుండా చేస్తానని అబద్ధపు మాటలు చెప్పి ప్రధానిగా ఎన్నికై 11 ఏళ్ళు అవుతున్న ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని పైగా నిరుద్యోగులను నిలువున్న ముంచారని ఆయన మండిపడ్డారు.ఇటు రాష్ట్ర ప్రభుత్వం మేం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేస్తాం,ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తాం,స్కిల్ ట్రెనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణను ఇచ్చి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ మీద రోజుకో మాట మాట్లాడుతూ మాటలతో కాలయాపన చేస్తున్నారని,అదేవిధంగా వాలంటీర్లకు 10000 గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి రెండు ఉగాదులు పోయిన వారి పైన కనీసం నోరు మెదపడం లేదని, కానిస్టేబుల్ అభ్యర్థులు ఈవెంట్స్ పూర్తి చేసుకుని మెయిన్ ఎగ్జామ్స్ కోసం పడిగాపులు కాస్తున్నారని అదేవిధంగా సచివాలయాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని వీటన్నిటిని భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండ కట్టే విధంగా నిరుద్యోగ సమస్యలపై యువత హక్కులపై పోరాడేందుకు మే 15 నుండి 18 వరకు అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ మహాసభలు తిరుపతి లో జరుగుతున్నాయని నిరుద్యోగులు మరియు యువత హక్కుల కోసం భవిష్యత్ పోరాటాలకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని ఈ మహాసభల్లో వేల మంది యువత దేశ విదేశాల నుండి పాల్గొంటున్నారని ఈ మహాసభల జయప్రదం కోరుతూ శనివారం కడప నగరంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ నాగేంద్ర జిల్లా సమితి సభ్యులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.